తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాదాద్రి భువనగిరి
శుక్రవారం
30 అక్టోబర్ 2026
పేజీలు : 8

## గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం అభివృద్ధి పనులు పూర్తి

**గోదావరి పుష్కరాల నాటికి భద్రాద్రి ఆలయం, పట్టణం సర్వాంగ సుందరం**

- నవంబర్ 15 నుంచి రాతి కట్టడాల పనులు ప్రారంభం
- గడువుకు పది రోజుల ముందే ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం
- మంత్రి పొంగులేటి

**భద్రాచలం అక్టోబర్ 29 (జనంసాక్షి)**
గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయంతో పాటు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు కంటే సుమారు పది రోజుల ముందుగానే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నవంబర్ 15 నుంచి రాతి కట్టడాల పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గురువారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయం చుట్టూ జరుగుతున్న పునరుద్ధరణ, అభివృద్ధి పనులను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు,

వార్తా లోపలి పేజీలో

## లక్ష్మీపురంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

వార్తా లోపలి పేజీలో

## గ్రామపంచాయతీ ఆస్తులు పక్కదోవ!

- కల్వలపాలెంలో ఇష్టారాజ్యంగా పంచాయతీ ట్రాక్టర్ అక్రమ వినియోగం
- సర్కారు భూమిలోనే మట్టి లోడ్లు స్పందించని బాధ్యతాయుత పంచాయతీ కార్యదర్శి!
- నిద్రమత్తులో యంత్రాంగం ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ కంటితుడుపు హెచ్చరికలతో సరి!

వార్తా లోపలి పేజీలో

## మున్సిపల్ ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్ పై అధికారులపై చర్యలకు కలెక్టర్ ఆదేశం

**సూర్యాపేట (జనంసాక్షి):**
హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన భూమిని ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. మున్సిపల్ ఆస్తి పన్ను రికార్డులను అక్రమంగా సృష్టించి, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. క్రిమినల్ ఫిర్యాదు నమోదు చేయడంతోపాటు, సమగ్ర విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్‌లో సుమారు 192 చదరపు గజాల స్థలంలో

వార్తా లోపలి పేజీలో

## రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించాలి

- పీఎం రాహత్‌లో 60 ఆసుపత్రుల నమోదు పూర్తి చేయాలి
- ప్రమాద ప్రాంతాలు, ఆసుపత్రుల జియో ట్యాగింగ్‌కు కలెక్టర్ ఆదేశం
- ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 29 (జనంసాక్షి)**
రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకం క్రింద జిల్లాలోని ఆరోగ్యశ్రీ జాబితాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు తప్పని సరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎం రాహత్ పథకం నోడల్ అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పథకం లక్ష్యాలు, అమలు విధానం, ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించారు.
జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఎంప్యానెల్ అయిన 60 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను పీఎం రాహత్ పథకంలో నమోదు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ప్రతి ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాల వివరాలను ఆసుపత్రులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. వచ్చే శనివారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీలు) అవసరమైన పత్రాలతో ఖమ్మం కలెక్టరేట్‌కు హాజరై పీఎం రాహత్ పథకంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసేందుకు కలెక్టరేట్‌లో 10 కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆదివారం అవసరమైన పరీక్షలు నిర్వహించి, వచ్చే సోమవారం నాటికి

వార్తా లోపలి పేజీలో

# గ్రామపంచాయతీ ఆస్తులు పక్కదోవ!

**కల్వలపాలెంలో ఇష్టారాజ్యంగా పంచాయతీ ట్రాక్టర్ అక్రమ వినియోగం**

**సర్కారు భూమిలోనే మట్టి లోడ్లు స్పందించని బాధ్యతాయుత పంచాయతీ కార్యదర్శి!**

**నిద్రమత్తులో యంత్రాంగం ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ కంటితుడుపు హెచ్చరికలతో సరి!**

**మాడుగులపల్లి అక్టోబర్ 29(జనం సాక్షి):** ప్రజాధనంతో సమకూరిన గ్రామ పంచాయతీ ఆస్తులు అక్రమార్కుల పాలిట సొంత ఆస్తి గా మారిపోతున్నాయి ఊరి పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ప్రజారోగ్య అవసరాల కోసం వినియోగించాల్సిన పంచాయతీ ట్రాక్టర్ మండలంలో కొందరు అధికారుల అండదండలతో వ్యక్తిగత, అక్రమ పనులకు పక్కదోవ పడుతోంది నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కల్వలపాలెం గ్రామంలో వెలుగుచూసిన ఈ ఘటనా వికాసాలు స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి.

**ఇన్‌ఛార్జ్ పాలన అక్రమార్కులకు వరం!**

కల్వలపాలెం గ్రామ పంచాయతీకి పూర్తిస్థాయి కార్యదర్శి లేకపోవడం, ఇన్‌ఛార్జ్ బాధ్యతలతో నడుస్తుండటాన్ని కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. కార్యదర్శి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, పంచాయతీ వాహనాన్ని యథేచ్ఛగా సొంత పనులకు మళ్ళిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**సర్కారు ట్రాక్టర్‌లో సర్కారు భూమిలోనే ఆక్రమణ!**

నేడు చోటుచేసుకున్న సంఘటన స్థానికులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో యథేచ్ఛగా మట్టిని లోడ్ చేసుకుని, ఊరిలోని ఒక ప్రభుత్వ ఉద్యోగి ఏకంగా ప్రభుత్వ భూమిలోనే సగం పూడ్చివేసేందుకు పోస్తున్న దృశ్యాలు ప్రత్యక్షంగా కనిపించాయి చట్టాన్ని రక్షించాల్సిన, ప్రభుత్వ నిబంధనలు తెలిసిన ఒక ఉద్యోగే ఈ రకంగా ప్రభుత్వ వాహనాన్ని వాడుకుంటూ, ప్రభుత్వ భూమినే ఆక్రమించే తరహాలో మట్టి పోస్తుంటే ఇక గ్రామ పంచాయతీ పాలనకు, నిబంధనలకు విలువెక్కడుందని గ్రామస్తులు మండిపడుతున్నారు.

**అడగాల్సిన అధికారులు మౌనం!**

బహిటంగా పంచాయతీ ట్రాక్టర్ దుర్వినియోగం అవుతున్న విషయాన్ని స్థానికులు వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు అయినప్పటికీ, ఏ ఒక్క అధికారీ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించకపోవడం గానీ, వాహనాన్ని అడ్డుకోకపోవడం గానీ అనేక అనుమానాలకు తావిస్తోంది స్థానిక యంత్రాంగం నిర్లక్ష్యంలో జోగుతోందా లేక అక్రమార్కులకు కొమ్ము కాస్తోందా అని గ్రామస్తులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.

**కార్యదర్శి అస్పందన మండల అధికారి రొటీన్ ప్రకటన!**

ఈ అక్రమ రవాణాపై వివరణ కోరేందుకు కల్వలపాలెం ఇన్‌ఛార్జ్ పంచాయతీ కార్యదర్శికి చరవాణి ద్వారా పలుమార్లు సంప్రదించేందుకు ప్రయత్నించగా, వారు స్పందించకపోవడం గమనార్హం కార్యదర్శికి తెలిసే ఇదంతా జరుగుతోందా లేక ఆయనను పక్కనబెట్టి మరీ ఆకతాయిలు, ఉద్యోగులు ట్రాక్టర్‌ను వాడుకుంటున్నారా అన్నది తేలాల్సి ఉంది మరోవైపు ఈ విషయమై మండల పంచాయతీ అధికారి (ఎంపీవో ), ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ సంగీత వివరణ కోరగా పంచాయతీ ట్రాక్టర్లను ఏ విధమైన అనధికారిక పనులకు వాడకూడదు ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్‌ను వాడితే విచారణ జరిపి చట్టరీత్యా భాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు

**గ్రామస్తుల ఆగ్రహం ఉన్నతాధికారులు స్పందించాలి!**

అధికారుల మాటలు కేవలం పేపర్లకే పరిమితమవుతున్నాయని, క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమని కల్వలపాలెం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి స్పందించి, కల్వలపాలెంలో పంచాయతీ ఆస్తులను దుర్వినియోగం చేసిన ప్రభుత్వ ఉద్యోగితో పాటు, దానికి సహకరించిన ఇన్‌ఛార్జ్ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మునుగోడు నియోజకవర్గ పట్టభద్రులారా కదలండి..

**ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి!**

**ఆరు మండలాల్లో 'ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్' ప్రత్యేక ఓటర్ నమోదు డ్రైవ్!**

**డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సాధించాలి - డా. ఇ ఎల్ వి భాస్కర్ పిలుపు**

**చౌటుప్పల్ అక్టోబర్ 29(జనంసాక్షి)** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్క పట్టభద్రుడు విధిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ డా. ఇ ఎల్ వి భాస్కర్ పిలుపు నిచ్చారు. ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని మునుగోడు, చౌటుప్పల్, చండూరు, సంస్థాన్ నారాయణపూర్, మర్రిగూడ, మరియు నాంపల్లి మండలాల్లో ఓటు నమోదు ప్రక్రియను ఉధృతం చేసినట్లు ఆయన తెలిపారు. విద్యావంతుల గళం శాసనమండలిలో బలంగా వినిపించాలన్నా, మన ప్రాంత సమస్యలు పరిష్కారం కావాలన్నా ప్రతి ఒక్కరి ఓటు ఎంతో కీలకమన్నారు.31 అక్టోబర్ 2023 నాటికి డిగ్రీ లేదా సమానమైన డిప్లొమా పూర్తి చేసి మూడేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకు అర్హులని వివరించారు. గతంలో ఓటు ఉన్న వారు కూడా ఇప్పుడు కొత్తగా ఫామ్-18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. నవంబర్ 6 చివరి తేదీ కావున అర్హులైన యువత, ఉద్యోగులు గడువులోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.కావలసిన పత్రాలు: ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల మెమో, పాస్ పోర్ట్ ఫోటో, సెల్ నెంబర్.ముఖ్య గమనిక: ఓటు నమోదులో ఎలాంటి సందేహాలున్నా, సహాయం కావాలన్నా ఆయా మండలాల్లోని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ప్రతినిధులను లేదా సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చు

## బీసీ రాజ్యాధికారమే ధ్యేయం..

## పెద్దవూరలో బీసీ రాజ్యాధికార యాత్రకు బ్రహ్మరథం

**36వ రోజుకు చేరుకున్న తీన్మార్ మల్లన్న, సుదర్శన్ యాత్ర**

**ఘన స్వాగతం పలికిన బీసీ జనాలు, ప్రజాసంఘాల నాయకులు**

**పెద్దవూర: అక్టోబర్ 29 (జనంసాక్షి)** బీసీల హక్కుల సాధన, సామాజిక న్యాయం, రాజ్యాధికారమే లక్ష్యంగా కొనసాగుతున్న 'బీసీ రాజ్యాధికార యాత్ర' గురువారం నల్గొండ జిల్లా పెద్దవూర మండలానికి చేరింది. విజయవంతంగా 36వ రోజుకు చేరుకున్న ఈ యాత్రకు మండల కేంద్రంలో బీసీ వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పూల వర్షం కురిపిస్తూ, డప్పు దరువులతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా యాత్రకు నేతృత్వం వహిస్తున్న తీన్మార్ మల్లన్న, ప్రసాదలతో పాటు పలువురు బీసీ నాయకులకు ప్రజలు పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు.

**రాజకీయాల్లోనూ, ఉపాధిలోనూ బీసీలకు తగిన వాటా దక్కాలి!**

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ.. "శాసన, చట్టసభల్లో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత లభించినప్పుడే సమాజంలో మార్పు వస్తుంది. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం సముచిత అవకాశాలు దక్కాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఈ యాత్రను చేపట్టాం" అని పేర్కొన్నారు. బీసీల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధించే వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

**సందోహంగా మారిన పెద్దవూర**

యాత్ర పెద్దవూరకు చేరుకోవడంతో స్థానిక బీసీ వర్గాల్లో తీవ్ర ఉత్సాహం నెలకొంది. గ్రామాలు, తండాల నుంచి బీసీ నాయకులు, యువకులు, మహిళలు, వివిధ రంగాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి యాత్రను విజయవంతం చేశారు. బీసీల ఐక్యతకు, హక్కుల పోరాటానికి ఈ యాత్ర ఒక నూతన ఉత్తేజాన్ని నింపిందని పలువురు నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థినులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**○ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి ○ పి.ఏ.పల్లి మండల విద్యాధికారి దన్నె రాజు**

**పి.ఏ.పల్లి,అక్టోబర్ 29 (జనంసాక్షి) :** విద్యార్థినుల విద్యాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పి.ఏ.పల్లి మండల విద్యాధికారి దన్నె రాజు సూచించారు.పి.ఏ.పల్లి మండల పరిధిలోని దుగ్యాల తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థినులకు ట్రంక్ బాక్సులు, బెడ్‌షీట్లు, కార్పెట్లు,ఐడీ కార్డులు,ప్లేట్లు,గ్లాసులు, స్పూన్లు,కప్పులు,బౌల్స్,స్కూల్ బ్యాగులు,టవల్స్ తదితర వస్తువులను అందజేశారు.విద్యార్థినులు వసతి గృహంలో సౌకర్యవంతంగా ఉంటూ,ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుపై పూర్తి దృష్టి సారించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు.

**విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం**

మండల విద్యాధికారి దన్నె రాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థినులు ఆర్థిక,సామాజిక పరిస్థితులతో సంబంధం లేకుండా నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, వసతి సదుపాయాలు విద్యార్థినుల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ, సమయపాలన పాటిస్తూ ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పాటించాలని కోరారు.పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం,సేవాభావాన్ని అలవర్చుకొని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో నిరంతరం కృషి చేస్తే అనుకున్న విజయాలను సాధించగలరని తెలిపారు.

**సమష్టి కృషితోనే విద్యార్థుల అభ్యున్నతి**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,పాఠశాల యాజమాన్యం సమష్టి కృషి ఎంతో కీలకమని దన్నె రాజు పేర్కొన్నారు.విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని,విద్య ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ విజయభాస్కర్, కేర్‌టేకర్ నాగార్జున కావ్య,సీనియర్ ఉపాధ్యాయులు సీనయ్య,పద్మావతి,సరిత,సునీత,విజయ,ఏఎన్ఎం రేణుక,సీఆర్పీ లింగయ్య,నైట్ వాచ్ ఉమెన్ గీత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించాలి

ప్రతి ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఎంప్యానెల్ అయిన అన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు సమాచారం అందించి, పీఎం రాహత్ పథకంలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

**రోడ్డు ప్రమాద బాధితులకు 7 రోజుల వరకు 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స:**

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 112 అత్యవసర సేవలకు ఫోన్ చేయాలనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. పీఎం రాహత్ పథకం ప్రయోజనాలు, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రమాద ప్రాంతాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులను జియో ట్యాగింగ్ చేసి మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోని ఆసుపత్రి వివరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని 108 అంబులెన్సులకు ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అంబులెన్సుల కదలికలు, బాధితులను ఆసుపత్రులకు తరలించే విధానాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోని తగిన వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి బాధితులను త్వరగా తరలించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పీఎం రాహత్ పథకం ప్రధాన ఉద్దేశ్యం రోడ్డు ప్రమాద బాధితులకు డబ్బు లేక చికిత్స ఆలస్యం కాకుండా, 7 రోజుల వరకు 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడటమేనని, ఈ లక్ష్యం నెరవేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

**ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు**

ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిపై అధిక వేగం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ రహదారిపై ప్రమాదాల సంఖ్య అధికంగా ఉండటానికి గల కారణాలను సమగ్రంగా విశ్లేషించి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. అధిక వేగాన్ని నియంత్రించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని,ప్రమాదాల నివారణకు అధునాతన ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పీఎం రాహత్ పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏసిపి శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్ పై అధికారులపై చర్యలకు కలెక్టర్ ఆదేశం

ఉన్న మున్సిపల్ బావి, పక్కనే ఉన్న భూమికి సంబంధించి ఈ వివాదం తలెత్తింది. ఈ స్థలానికి అక్రమంగా మున్సిపల్ ఆస్తి పన్ను మదింపు సృష్టించి,దానిని ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉపయోగించినట్లు ఆరోపణలు వచ్చాయి. హుజూర్‌నగర్ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన నివేదికల ఆధారంగా కలెక్టర్ చర్యలకు ఆదేశించారు. ఆస్తి రికార్డుల సృష్టి, ధ్రువీకరణ, ప్రాసెసింగ్‌లో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గతంలో పని చేసిన అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రెవెన్యూ ఆఫీసర్ రెవెన్యూ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ పై క్రమశిక్షణా చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం వారు ఎక్కడ పని చేస్తున్న నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత అవుట్ సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను తొలగించారు. వివాదాస్పద స్థలాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. భూమి యాజమాన్యం, విస్తీర్ణం, హద్దులను నిర్ధారించి, రికార్డులను చట్టప్రకారం సరిచేయాలని సూచించారు. మున్సిపల్ ఆస్తి రికార్డులను మోసపూరితంగా సృష్టించడం, దుర్వినియోగం చేయడం, అక్రమ లావాదేవీలో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ ఫిర్యాదు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసరించిన విధానంపై సంబంధిత సబ్ రిజిస్ట్రార్ ద్వారా నివేదిక కోరారు. సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టనున్నారు. మున్సిపల్ భూములు,బావులు, రోడ్లు, ప్రజా స్థలాలు, ఇతర ఆస్తులకు సంబంధించి జిల్లాలో ఇలాంటి అక్రమాలు జరిగాయా అనే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు. సంబంధిత అధికారులు, ప్రైవేట్ వ్యక్తుల పాత్రపై విచారణ జరిపి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని, అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# లక్ష్మీపురంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి
- రైతులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**బూర్గంపహాడ్ అక్టోబర్ 29 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన పత్తి కొనుగోలు కేంద్రాన్ని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ, మండలి ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుని వర్షపాతంలో హెచ్చుతగ్గులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగు, సంరక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ పంటలకు అవసరమైన నీటి యాజమాన్యం, తెగుళ్లు, చీడపీడలనివారణకు వ్యవసాయ నిపుణుల సలహాలు పాటించాలని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. పత్తి నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం తదితర నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ రైతులకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందించి పంట నష్టాలను తగ్గించేందుకు రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కె శారద, మార్కెట్ కమిటీ చైర్మన్, ఏడిఈ తాతారావు, ఎంపీడీవో జమలా రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోలపల్లి సుధాకర్ రెడ్డి, లక్ష్మీపురం సర్పంచ్ బాదం వెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పిటిసి విజయ గాంధీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సేవాలాల్, ఇంగువ రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల నాటికి
# భద్రాచలం అభివృద్ధి పనులు పూర్తి

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనం పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ప్రధాన ఆలయాలను అనుసంధానిస్తూ ప్రత్యేక ఆలయ పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గోదావరి పుష్కరాల నాటికి మార్గంలోని ఆలయాలను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ఆలయం ఒకవైపు, నివాస ప్రాంతాలు మరోవైపు ఉండటంతో కొండపై రాతిని తొలగించే పనులను అత్యంత జాగ్రత్తగా చేపడుతున్నామని వివరించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిర్మాణాల నాణ్యతలో రాజీ పడకుండా పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భద్రాచలం పట్టణంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా సులభంగా బయటకు వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే పలుమార్లు ముఖ్యమంత్రి, ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. డ్రైనేజీ పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని, వాటిని కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని మంత్రి అభినందించారు. గోదావరి పుష్కరాల నాటికి ఆలయంతో పాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్‌రావు, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలి: పెద్దవూర పీఎస్ తనిఖీలో సీఐ శ్రీనునాయక్

**స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పరిశీలన**

**శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశం**

**పెద్దవూర: అక్టోబర్ 29 (జనంసాక్షి )**

పెద్దవూర పోలీస్ స్టేషన్‌ను స్థానిక సీఐ శ్రీనునాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించి, సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని నిర్వహణ రికార్డులను, లాకప్‌తో పాటు వివిధ విభాగాలు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ గోపాల్‌రావును అడిగి తెలుసుకున్నారు.

**ప్రజలకు మెరుగైన సేవలు.. పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం**

ఈ సందర్భంగా సీఐ శ్రీనునాయక్ మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సమస్యలను విని త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల స్నేహపూర్వకంగా ప్రవర్తిస్తూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**శాంతిభద్రతలపై నిరంతర నిఘా**

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెట్రోలింగ్ పెంచాలని సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు. నేరాల అదుపునకు, సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర ఎస్ఐ గోపాల్‌రావుతో పాటు స్టేషన్ ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం:శ్రీనివాస్ రెడ్డి

**మాడుగులపల్లి అక్టోబర్ 29**

(జనం సాక్షి): నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పందిరి సతీష్ - రాధిక దంపతుల నూతన ఇందిరమ్మ ఇల్లు ఘనంగా ప్రారంభమైంది ఈ కార్యక్రమానికి పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు బాల్నే ఇంద్రారెడ్డి, మునుగోడు యాదగిరి, గుడుపాటి శ్రీనివాసు, తామరపల్లి నాగరాజు, జానీ, పందిరి కొండలు, కట్ట శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వాదంతో భాస్కరుడి దూకుడు!

**మునుగోడు రాజకీయాల్లో**
**పెను సంచలనం!**
**సేవా కార్యక్రమాలతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు**
**బీసీ ఆత్మగౌరవమే అజెండా..**
**మునుగోడు అభివృద్ధే లక్ష్యం!**
**సొంత గడ్డపై సేవా సంకల్పం!**
**జనం సాక్షి। ప్రత్యేక రాజకీయ కథనం**

**మర్రిగూడ, అక్టోబర్ 29( జనంసాక్షి )**

ప్రజాసేవే లక్ష్యంగా.. బీసీ ఆత్మగౌరవమే ఆశయంగా.. సొంత ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా ఈఎల్వీ భాస్కర్ అడుగులు మునుగోడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు చదువు కోసం చేయూత, వైద్య అవసరాలకు అండ, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకారం అందిస్తూ ప్రజలకు చేరువవుతున్నారని ఫౌండేషన్ వర్గాలు చెబుతున్నాయి. సేవా కార్యక్రమాలను విస్తరిస్తూ ప్రజల అవసరాలకు స్పందించడం, బీసీ నాయకత్వానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే ఆకాంక్షను ముందుకు తీసుకెళ్లడం భాస్కర్ రాజకీయ ప్రస్థానంలో ప్రధాన అంశాలుగా నిలుస్తున్నాయి.

తెలంగాణలో బీసీ వాదం బలపడుతున్న సమయంలో మునుగోడులోనూ సామాజిక ప్రాతినిధ్యం, రాజకీయ అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధిపై చర్చకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో భాస్కర్ సేవా కార్యక్రమాలు, ఆయన ప్రజా జీవితంపై వ్యక్తం చేస్తున్న ఆసక్తి స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

**సొంత గడ్డపై మమకారం**

బెంగళూరులో గుర్తింపు పొందిన భాస్కర్, సొంత ప్రాంతంపై మమకారంతో మునుగోడు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. తన ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి వారికి సహాయం అందించడం, పేద కుటుంబాలకు అండగా నిలవడం, విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో అనుబంధాన్ని పెంచుకుంటున్నారని చెబుతున్నారు.సొంత ప్రాంతంపై ప్రేమ, ప్రజల పట్ల బాధ్యత, సేవ చేయాలనే తపన ఒక నాయకుడి ప్రజా ప్రస్థానానికి పునాదులుగా నిలుస్తాయి. భాస్కర్ ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు మరింత విస్తరించి ఎక్కువమంది అర్హులకు చేరాలన్నది ఆయన అనుచరుల ఆకాంక్ష. విద్య, వైద్యం, పేద కుటుంబాల సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం సమాజానికి ఉపయోగకరమైన దిశ.

**బీసీ ఆత్మగౌరవం.. రాజకీయ ప్రాతినిధ్యమే లక్ష్యం!**

బీసీ వర్గాలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలనే చర్చ తెలంగాణవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీ వర్గాలకు రాజకీయ నిర్ణయాల్లో, పార్టీ నాయకత్వంలో, ప్రజాప్రతినిధుల స్థానాల్లో తగిన

అవకాశాలు కల్పించాలనే ఆకాంక్ష బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో బీసీ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన భాస్కర్ ప్రజా జీవితంలో ముందుకు సాగడంపై ఆసక్తి పెరుగుతోంది. బీసీ నాయకత్వం ఎదగడం, అన్ని సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుంది. రాజకీయాల్లో నాయకుడి సామాజిక నేపథ్యంతో పాటు ప్రజలతో ఉన్న అనుబంధం, ప్రజా సమస్యలపై అవగాహన, అభివృద్ధి పట్ల నిబద్ధత కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

మునుగోడులో బీసీ వర్గాల రాజకీయ ప్రాతినిధ్యం, నాయకత్వ అవకాశాలు, ప్రధాన పార్టీల పాత్రపై చర్చ పెరుగుతున్న నేపథ్యంలో భాస్కర్ రాజకీయ ప్రస్థానం ప్రాధాన్యం సంతరించుకుంది. అన్ని వర్గాల నాయకులకు సముచిత అవకాశాలు కల్పించడం, ప్రజాసేవకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రాజకీయ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.

**ఫౌండేషన్ సేవలే ప్రజలతో అనుబంధానికి పునాది!**

ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా సహకారం, వైద్య అవసరాలకు తోడ్పాటు, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండ అందిస్తున్నట్లు ఫౌండేషన్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగి అర్హులైన వారికి చేరితే సమాజంలో సేవాభావం మరింత బలపడుతుంది.విద్యార్థుల చదువు ఆగిపోకుండా సహాయం అందించడం, వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడే కుటుంబాలకు తోడ్పడడం, ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలవడం ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే కార్యక్రమాలు. ఈ సేవలను మరింత విస్తరించి విద్య, వైద్యం, పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఫౌండేషన్ కార్యకలాపాలు మరింత మందికి చేరువ కావచ్చు.

ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవడం, వారి అవసరాలకు స్పందించడం, స్థానిక సమస్యలపై దృష్టి సారించడం ప్రజా జీవితంలో కీలక అంశాలు. ఈ దిశగా భాస్కర్ తన సేవా కార్యక్రమాలను విస్తరించాలనే ఆకాంక్ష ఆయన మద్దతుదారుల్లో వ్యక్తమవుతోంది.

**రాచకొండ వేదికపై ప్రాంతీయ అభివృద్ధి గళం!**

గట్టుప్పల్‌లో నిర్వహించిన రాచకొండ దసరా ఉత్సవాల సందర్భంగా భాస్కర్ శివన్నగూడెం రిజర్వాయర్ పూర్తి, రాచకొండ ఎత్తిపోతల పథకం, రైతులకు సాగునీరు, తాగునీటి సమస్యలు, బీసీ ఆత్మగౌరవం వంటి అంశాలను ప్రస్తావించారు. రైతాంగ సమస్యలు, ప్రాంతీయ అభివృద్ధి, సామాజిక ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకురావడం ఆయన ప్రసంగంలో ప్రాధాన్యం పొందింది.

“రాచకొండ రాజ్యమా.. ఉలిక్కిపడు! నీ కొడుకు వచ్చాడు!” అనే నినాదంతో భాస్కర్ తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. మునుగోడు ప్రాంతంలో సాగునీటి సదుపాయాలు, తాగునీటి సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం వంటి అంశాలు ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. ఈ అంశాలపై నిరంతర చర్చ, ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు, అభివృద్ధి కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రాంత భవిష్యత్తుకు కీలకం.

**మునుగోడు రాజకీయాల్లో కొత్త చర్చకు భాస్కర్ కేంద్రబిందువు!**

బీసీ వాదం, సేవా కార్యక్రమాలు, ప్రాంతీయ అభివృద్ధి అంశాలతో భాస్కర్ పేరు మునుగోడు రాజకీయ చర్చలో ప్రాధాన్యం పొందుతోంది. ఆయన ఫౌండేషన్ సేవలు, ప్రజలతో అనుబంధం, భవిష్యత్తు కార్యాచరణపై ఆసక్తి పెరుగుతోంది. ఈ పరిణామం ప్రధాన రాజకీయ పార్టీలకు కూడా సామాజిక ప్రాతినిధ్యం, స్థానిక నాయకత్వం, ప్రజా సమస్యలపై తమ విధానాలను స్పష్టంగా వివరించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.

ప్రజాసేవలో పోటీ పెరగడం ప్రజలకు ఉపయోగకరమైన పరిణామం. ఎవరు ఎక్కువమందికి సహాయం అందిస్తారు? ఎవరు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు? ఎవరు ప్రాంత అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వస్తారు? అనే అంశాలపై రాజకీయ చర్చ సాగితే ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుతుంది.

**బీసీ బిడ్డకు సమాన అవకాశం.. మునుగోడుకు సమగ్ర అభివృద్ధి!**

మునుగోడు రాజకీయాల్లో అన్ని సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం, బీసీ నాయకత్వానికి సముచిత ప్రాతినిధ్యం ఇవ్వడం, పేదలకు సేవా కార్యక్రమాలను విస్తరించడం కీలక అంశాలు. భాస్కర్ తన ఫౌండేషన్ సేవలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై దృష్టి సారించడం, విద్య, వైద్యం, రైతాంగ సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధిపై తన కార్యాచరణను బలోపేతం చేసుకోవడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చు.

మునుగోడుకు కావాల్సింది సామాజిక విభేదాలు కాదు.. అన్ని వర్గాల భాగస్వామ్యం. వ్యక్తిగత విమర్శలు కాదు.. ప్రజాసేవలో పోటీ. హామీలకే పరిమితమైన రాజకీయాలు కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే అభివృద్ధి కార్యక్రమాలు.

బీసీ ఆత్మగౌరవం, ప్రజాసేవ, ప్రాంతీయ అభివృద్ధి అనే అంశాలతో ఈఎల్వీ భాస్కర్ ప్రస్థానం మునుగోడులో కొత్త చర్చకు దారితీస్తోంది. సేవా కార్యక్రమాల విస్తరణ, ప్రజలతో అనుబంధం, అభివృద్ధిపై కార్యాచరణ ఆయన ప్రజా జీవితంలో కీలక అంశాలుగా నిలుస్తున్నాయి. మునుగోడులో అన్ని వర్గాలకు సమాన రాజకీయ అవకాశాలు కల్పిస్తూ ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడమే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

**సూర్యాపేట (జనంసాక్షి):**

ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.గురువారం సూర్యాపేట పట్టణంలోని 22వ వార్డు రాజీవ్ నగర్ లో కౌన్సిలర్ ఏలుగూరి అలివేలు చంటి బాబుతో కలిసి తండు అంజలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.నూతన గృహంలో గృహప్రవేశం చేస్తున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతే ధ్యేయంగా

కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

### యాసంగి సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించన

**బొమ్మలరామారం అక్టోబర్ 29 (జనంసాక్షి)**

పంటను దళారుల అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రైతులకు సూచించారు గురువారం మండలంలోని మర్యాల, చౌదర్ పల్లి గ్రామంలో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో రెండో వరి పంట సాగులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలన్నారు.అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలని

సూచించారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ, తాసిల్దార్ రాధా, సింగిల్ విండో చైర్మన్ సింగర్తి మల్లేష్, భువనగిరి మార్కెట్ కమిటీ తాజా మాజీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్,ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్, సింగిల్ విండో డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, మహిళా అధ్యక్షురాలు యంజాల కళ,పలు గ్రామాల సర్పంచులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# అనుముల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని బీఆర్ఎస్ డిమాండ్

**హాలియా జనంసాక్షి :**

తెలంగాణ ప్రభుత్వం నినాదు ప్రకటించిన కరువు మండలాల జాబితాలో నల్గొండ జిల్లాలోని 33 మండలాలకు గాను 28 మండలాలను మాత్రమే చేర్చడంపై అనుముల మండల రైతులు, బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుముల మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం పత్రికా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, అనుముల మండలంలో సుమారు 40 వేల ఎకరాల సాగు భూమి ఉందని తెలిపారు. ఈ వర్షాకాలంలో పత్తి, వరి పంటలు కొన్ని ప్రాంతాల్లో సాగు చేసినప్పటికీ, తీవ్ర వర్షాభావం కారణంగా పత్తి పంట పూర్తిగా నష్టపోయిందని ఆరోపించారు. వరి సాగు చేసిన రైతులకు సరైన సమయంలో నీరు, విద్యుత్తు అందకపోవడంతో వేసిన పంటలు కూడా ఎండిపోయాయని వివరించారు. మండలం లో కనీసం 20 శాతం పంట కూడా రైతుల చేతికి రాలేదని, కరువు పరిస్థితి కారణంగా పొలాలు బీళ్లుగా మారాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనుముల మండలంలోని తలాపన కృష్ణమ్మ సాగునీటికి సరిపోకపోవడంతో,

ప్రభుత్వం అనుముల రైతుల అవసరాలను పట్టించుకోకుండా నీటిని ఖమ్మం వరకు తరలించిందని ఆరోపించారు.

**ప్రభుత్వానికి విజ్ఞప్తి**

అనుముల మండల రైతులు సుభిక్షంగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించడం దురదృష్టకరమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, వాస్తవ పరిస్థితిని గుర్తించి అనుముల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీతో పాటు ప్రభుత్వ కీలక సలహాదారు జానారెడ్డికి విజ్ఞప్తి చేశారు. నుముల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోతే, రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని పార్టీ నాయకులు స్పష్టం చేశారు. కరువు మండలంగా ప్రకటన జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు వడ్డే సతీష్ రెడ్డి, పీఏసీ చైర్మన్ రెక్కల మధుసూదనరెడ్డి, టీఆర్ఎస్ మండల నాయకులు కర్నే నర్సిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్గొండ సుధాకర్, వర వెంకటరెడ్డి పాల్గొన్నారు. హజారిగూడెం సర్పంచ్ భాస్కర్ రెడ్డి, చేగొండి కృష్ణ, ఉర్లుకొండ వెంకటయ్య, చాపల సైదులు, చిట్టిపోలు శ్రీనివాస్, సురభి రాంబాబు, పిల్లి వెంకట్, ఎడవల్లి నాగరాజు, రామలింగయ్య, ఆవుల సైదులు, పేరుమల్ల రాంబాబు, దుండిగల నరసింహ, మహేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం

చింతలపాలెం(జనంసాక్షి)

చింతలపాలెం మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామపంచాయతీలో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.ఇందులో భాగంగా ఇంటికొక ఇంకుడు గుంత నిర్మాణం, పంట కుంటల ఏర్పాటు,బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలపై దృష్టి సారించాలని తెలిపారు.పశువులకు అవసరమైన పశుగ్రాసం కోసం గడ్డి పెంపకం,తోటల అభివృద్ధిని ప్రోత్సహించాలని, అవసరమైన ప్రాంతాల్లో పశువులకు నీటి తొట్లను నిర్మించాలని సూచించా రు.అలాగే గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని సర్పంచులను కోరారు.గ్రామాల్లో నీటి సంరక్షణ,పశుగ్రాసం అభివృద్ధి,ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి,ఎంపీడీవో ఆందాలు, తహసీల్దార్ రామకృష్ణారెడ్డి,ఎంపీఓ భూపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ మహేందర్ మరియు వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**సూర్యాపేట (జనంసాక్షి):**

పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఉమ్మడి నల్లగొండ,ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని 35వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య కరుణాకర్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ మెరుగైన జీవన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఉన్న పోలీస్ సామాగ్రి బహిరంగ వేలం

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా పోలీస్ శాఖలో నిరుపయోగంగా ఉన్న వివిధ రకాల వస్తువులను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు జిల్లా ఎస్పీ కె.నరసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పోలీస్ కార్యాలయాల్లో ఉన్న నిరుపయోగ వస్తువులను నిబంధనల ప్రకారం వేలం వేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.ఈ వేలంలో టెంట్ సామాగ్రి, ఫైబర్ ప్లాస్టిక్ సామాగ్రి, ఇనుప సామాగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు, తదితర పనికిరాని వస్తువులు ఉన్నట్లు తెలిపారు.నవంబర్ 4న ఉదయం 11 గంటలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న పాత ఎస్పి కార్యాలయం లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఆసక్తి గల వారు వేలం ప్రక్రియలో పాల్గొని, సంబంధిత నిబంధనల ప్రకారం వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని అన్నారు.మరిన్ని వివరాలకు రిజర్వ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ సెల్ నంబర్ 8712686018లో సంప్రదించవచ్చని తెలిపారు.

# వార్డు మెంబర్ల ఫోరం మండల కమిటీ ఎన్నిక

**కనగల్లు, అక్టోబర్ 29 (జనం సాక్షి)**

గ్రామపంచయతీ వార్డు మెంబర్ల ఫోరం మండల కమిటీని గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో వార్డు మెంబర్ల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షులుగా మేకల నరసింహ ప్రధాన కార్యదర్శులుగా పందుల రాజా, కందుల ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా పెరిక వెంకటేశం, కొరివి వెంకన్న, బుర్రి రవి, ముచ్చపోతుల పరమేష్, అశోక్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా నరసింహ చారి పరమేష్, లింగస్వామి, మహిళ అధ్యక్షురాలుగా లక్ష్మి రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రోళ్ల కవిత, సూరవరం నీలవేణి, వర్కింగ్ ప్రెసిడెంట్ భారీ శ్రీను, ల తో పాటు కార్యవర్గ సభ్యులను రాష్ట్ర అధ్యక్షులు పోగుల నాగార్జున రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేకల నరసింహ మాట్లాడుతూ వార్డు సభ్యుల సమస్యల పరిష్కారంతోపాటు వారి హక్కులను కాపాడదానికి కృషి చేస్తానని తెలిపారు నా ఎన్నికకు సహకరించిన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎర్రోళ్ళ సురేష్, బీరెల్లి నాగరాజు, ము కమల శంకర్, దండు యాదయ్య, శ్రీకాంత్, రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులందరూ ఎమ్మెల్సీ ఓట్లపై అవగాహన కలిగి ఉండాలి

## బిజెపి మండల పార్టీ అధ్యక్షులు భూతరాజు భరత్

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి):**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి పట్టణంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షులు భూషరాజు భరత్, ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ మండల కన్వీనర్ బొడ్డు యాదగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ఉపాధ్యాయులందరూ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగ సమస్యలు, విద్యారంగానికి సంబంధించిన అంశాలపై చర్చిస్తూ అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రజాస్వామ్య వేదికలపై ప్రస్తావించేందుకు వారి హక్కుల సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు కీలకమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నల్లగొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్దా భాస్కర్, నెల్లికంటి గోపి, చందు, ఉదయ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# సంజీవని హాస్పిటల్ వైద్య సిబ్బందితో ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించిన డాక్టర్ పంబాల పర్వతాలు

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి):** వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి గెలుపే లక్ష్యంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పంబాల పర్వతాలు ఆధ్వర్యంలో గురువారం దేవరకొండ పట్టణంలోని సంజీవని హాస్పిటల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్యులు, వైద్య సిబ్బందిని కలిసి పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, అర్హులైన పట్టభద్రులతో ఓటు నమోదు చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ పంబాల పర్వతాలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని సమాజ భవిష్యత్తును నిర్ణయించే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును వినియోగించుకునే దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడికి బాధ్యత ఉందని ఓటు హక్కు వినియోగం ద్వారా ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన తెలిపారు. విద్యావంతులు, ఉద్యోగులు, వైద్యులు, ఇతర

వృత్తి నిపుణులు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, అర్హులైన ఇతర పట్టభద్రులకు కూడా ఓటు నమోదు ప్రాముఖ్యతను వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది రమేష్, ప్రసాద్, సురేష్, శివ, రమేష్, శ్వేత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పేరుతో రైతులకు షరతులా?

- స్వీయ ప్రకటన నిబంధన రైతాంగాన్ని అవమానించడమే!
- రైతు భరోసా సాయం ఎకరాకు రూ.40 వేలకు పెంచాలి: మాజీ రైతుబంధు సమితి కన్వీనర్ బచ్చు రామకృష్ణ

**మర్రిగూడ, అక్టోబర్29 (జనంసాక్షి)**
ఎల్‌నినో వాతావరణ పరిస్థితులను సాకుగా చూపుతూ రైతులపై స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్) నిబంధనలు విధించడం అన్యాయమని మాజీ మండల రైతుబంధు సమితి కన్వీనర్ బచ్చు రామకృష్ణ విమర్శించారు. గురువారం మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సొంత భూమిలో ఏ పంట సాగు చేయాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ రైతులకు ఉండాలని, సాగు కోసం ప్రభుత్వ అనుమతి తీసు కోవాలన్నట్లుగా నిబంధనలు విధించడం రైతుల హక్కులను కాలరాయడమేనని అన్నారు. ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెట్టే రైతులను షరతులతో కట్టడి చేయాలని చూడటం సమంజసం కాదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు రైతులకు భరోసా కల్పించి, ఆర్థికంగా అండగా నిలవాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిం చడం తగదని పేర్కొన్నారు. రైతులపై అనవసర నిబంధనలు విధించడం మానుకుని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు.

**రైతు భరోసా సాయం పెంచాలి**
రైతులకు అందించే రైతు భరోసా ఆర్థిక సాయాన్ని పెంచి ఎకరాకు రూ.40 వేల చొప్పున అందించాలని బచ్చు రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు అవసరమైన విద్యుత్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో సరఫరా చేసి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కౌలు రైతుల కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి, పనిదినాలు పెంచడం ద్వారా వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి పరిస్థితులను అర్థం చేసుకోకుండా షరతులు విధించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాల్సింది పోయి, రైతులను మరింత ఆందోళనకు గురిచేయడం సరికాదన్నారు.

**కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్న రైతులు**
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమానికి రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అమలు చేశారని బచ్చు రామకృష్ణ గుర్తుచేశారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడంతోపాటు సాగుకు అవసరమైన విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుతో వ్యవసాయ రంగానికి మద్దతు కల్పించేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్క రించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని, ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా ఎదుర్కొనేలా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు భరోసా కల్పించే విధానాలు అమలు చేయాలని, షరతులతో వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రామిడి వెంకట రమణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు రాపోలు యాదగిరి, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ యాకుబ్, రాష్ట్ర గిరిజన నాయకుడు రామావత్ శ్రీనునాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బూరుగు నాగరాజు, గ్రామ ప్రధాన కార్యదర్శి వట్టికోటి శేఖర్, వార్డు సభ్యుడు కొండాపురం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

**అధికారులకు అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాలు:**

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 29, (జనం సాక్షి):**
వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫారం-18 దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించాలని, డూప్లికేట్ ఓట్లను గుర్తించి నిబంధనల ప్రకారం తిరస్కరించాలని స్పష్టం చేశారు.గురువారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని వరంగల్?ఖమ్మం?నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) ఛాంబర్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాల ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్వోలు), ఆర్డీవోలతో ఆయన ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ ముందంజలో ఉండటంపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లోనూ ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు.ఓటరు నమోదుకు అందిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, దరఖాస్తుదారుల విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. విశ్వవిద్యాలయాలు జారీ చేసిన డిగ్రీ ధ్రువపత్రాల పరిశీలనలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి సర్టిఫికెట్ల పరిశీలనను వేగవంతం చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలని, ఒకే వ్యక్తి పేరుతో డూప్లికేట్ ఓట్లు నమోదుకాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేయాలని, ఉపాధ్యాయులకు వారి నివాస ప్రాంతాలకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, జంబో బ్యాలెట్ బాక్సుల లభ్యతపై కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏ జిల్లాలోనైనా ఎన్నికల సామగ్రి కొరత ఉంటే వెంటనే తెలియజేయాలని, అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

**రెండు షిఫ్టుల్లో దరఖాస్తుల పరిశీలన:**
జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. డీటీసీలోని కంప్యూటర్ కేంద్రంలో 20 కంప్యూటర్లను ఏర్పాటు చేసి, సిబ్బందితో రెండు షిఫ్టుల్లో రాత్రింబవళ్లు దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎంజీ యూనివర్సిటీ విద్యార్థుల సహకారం తీసుకుంటున్నామని, ఆర్డీవో స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని చెప్పారు. రానున్న నాలుగు రోజుల్లో ఓటరు నమోదు సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, ఉమ్మడి జిల్లాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తండాల అభివృద్ధి, పటేల్

**బీటి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న పటేల్ రమేష్ రెడ్డి**

**పెన్ పహాడ్, అక్టోబర్ 29 (జనంసాక్షి) :**
కాంగ్రెస్ ప్రభుత్వం లోనే మారూ మూల తండాలు అభివృద్ధి చెందుతున్నాయనీ తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మేఘ్యా తండా నుండి గంగ్లీతండా వరకు కోటి 84 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , గతంలో తండాలలో కనీస వసతులు కూడా లేవని, నేడు ప్రతి తండాలో సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. మేఘ్యా తండా గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు, స్థానిక సర్పంచ్ భూక్యా రాజు,ఎం డి షఫీ ఉల్లా,వెలుగు వెంకన్న, కొండేటి పవన్,యాట ఉపేందర్ మాజీఎంపీటీసీ, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపోడు రైతుల కన్నీరు చూపిస్తా.. క్షేత్రస్థాయికి రండి

**ప్రభుత్వానికి పిజిఆర్ బహిరంగ సవాల్!**

**గుర్రంపోడు, అక్టోబర్ 29 (జనంసాక్షి)**
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాపై నల్గొండ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తీవ్ర వర్షాభావంతో కొట్టుమిట్టాడుతున్న గుర్రంపోడు మండలానికి కరువు జాబితాలో చోటు దక్కకపోవడంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయం అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో కూడి ఉందని ఆయన ధ్వజమెత్తారు.ఏసీ గదుల్లో కూర్చుని నివేదికలా? క్షేత్రస్థాయికి రండి.. రైతుల కన్నీళ్లు చూపిస్తా.అంటూ పిజిఆర్ అధికారులకు, ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. భూగర్భ జలాలు అడుగంటి, వేలాది ఎకరాల్లో పంటలు నిలువునా ఎండిపోతుంటే ప్రభుత్వం కళ్లుండి కూడా చూడలేని గుడ్డిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. న్యాయం జరగకపోతే నల్గొండ దద్దరిల్లుతుంది.రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల పొట్ట కొట్టొద్దని హితవు పలికిన పిజిఆర్, ప్రభుత్వం వెంటనే గుర్రంపోడును కరువు మండలంగా ప్రకటించి, ఇన్పుట్ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, గుర్రంపోడు రైతాంగం పక్షాన పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కరువు పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలిచి, ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు విశ్రమించదని ఆయన స్పష్టం చేశారు.

## పోచంపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఐజీ జోయెల్ డేవిస్

**కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి-ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలి**

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 29 (జనం సాక్షి):**
పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా డీఐజీ జోయెల్ డేవిస్, జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ గురువారం సందర్శించి తనిఖీ నిర్వహించారు. ముందుగా డీఐజీ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించగా, ఎస్‌హెచ్ఓ జగన్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పరిచయం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ నిర్వహణ డైరీ, స్టేషన్ రికార్డులు, సిబ్బంది విధులు, వాహనాల నిర్వహణ, కోర్టు రికార్డులు, కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాల సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ, ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, సీఐ సతీష్ రెడ్డి, రూరల్ సీఐ మన్మధకుమార్, రామన్నపేట సీఐ రవి, పోచంపల్లి మహిళా ఎస్ఐ లైలా, ఏఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ చదువుల్లో రాణించాలి

○ పౌష్టికాహారం తీసుకోవాలి.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

○విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్

**బూర్గంపహాడ్ అక్టోబర్ 29 (జనంసాక్షి)**
విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం రాథోడ్ సూచించారు. ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మెదడుకు రక్తప్రసరణలో ఆటంకం ఏర్పడినప్పుడు వచ్చే పక్షవాతం, గుండెపోటు లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సంపద కంటే ఆరోగ్యమే ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని, ఆ విషయాలను కుటుంబ సభ్యులకు, ఇతరులకు తెలియజేయాలని కోరారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటికి అలవాటుపడితే జీవితాలు అర్థాంతరంగా ముగిసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జీవితంలో ఉన్నదానితో సంతృప్తి చెందుతూ, ఒత్తిడికి లోనుకాకుండా సంతోషంగా ఉండాలని సూచించారు. సేవాభావాన్ని అలవర్చుకుని, తోటి వారికి సహాయం చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆరోగ్య పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారి సోమ్లా నాయక్, సామాజిక ఆరోగ్య అధికారి విజయలక్ష్మి, ఏఎన్ఎం పద్మ, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి!

○అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి

○బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నాగేష్ పిలుపు

**చింతపల్లి, అక్టోబర్ 29(జనంసాక్షి)**
వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ చింతపల్లి మండల అధ్యక్షుడు సముద్రాల నాగేష్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించి, వారి హక్కుల సాధనకు కృషి చేసే నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదును నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన ధ్రువ పత్రాలతో నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తుల్లో అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెనమోని రాములు, శివర్ల రమేష్, శేఖర్, ఎర్ర వెంకటయ్య, బొడ్డు మహేష్, గజ్జ అభినవ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో చట్టం, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**హాలియా, జనం సాక్షి, అక్టోబర్ 29:**
హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిడమనూరు గౌరవ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ డి.టి. పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోక్సో చట్టం, డిజిటల్ అక్షరాస్యత మరియు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గౌరవ న్యాయమూర్తి పోక్సో చట్టం బాలలను లైంగిక వేధింపులు, దుర్వినియోగం నుంచి రక్షించే చట్టపరమైన కవచం అని వివరించారు. విద్యార్థులు తమ హక్కులు, చట్టాలు, స్వయం రక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్త వహించాలని, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ వేధింపులు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏదైనా వేధింపు లేదా సమస్య ఎదురైనట్లయితే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను వెంటనే సంప్రదించాలని న్యాయమూర్తి సూచించారు. పోక్సో చట్టం ప్రకారం బాలలపై జరిగే నేరాలను నివేదించడం చట్టబద్ధమైన బాధ్యత అని, పిల్లల గోప్యత మరియు రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

**"పోలీస్ అక్క" కార్యక్రమం**

అనంతరం హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ, "పోలీస్ అక్క" కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం ఒక మహిళా కానిస్టేబుల్ పాఠశాలను సందర్శించి, విద్యార్థినుల సమస్యలను విని అవసరమైన సహాయం అందిస్తారని తెలిపారు. విద్యార్థినులు ఎలాంటి వేధింపులు లేదా భద్రతా సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీ కంది మల్ల నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, హాలియా ఎస్ఐ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి

**వలిగొండ, అక్టోబర్ 29( జనంసాక్షి )**
మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి గురువారం లొతుకుంట బాలికల హాస్టల్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. హాస్టల్ పరిసరాల పరిశుభ్రత, ఆహార నిల్వలు, ఆహార నాణ్యత, విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, సంబంధిత రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం సుంకిశాల గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు హాజరైన ఆయన ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులు, వ్యవసాయంపై వాటి ప్రభావాల గురించి రైతులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయానికి, తాగునీటికి నీటి అవసరం ఎంతో కీలకమని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్థులతో నీటి సంరక్షణ, పొదుపు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైళ్ల సంధ్యారాణి, ఉపసర్పంచ్ మంగ జగనయ్య, జీపీఓ ఎ. అనిత, ఏఈఓ గోపీనాథ్, జూనియర్ లైన్‌మన్, ఫీల్డ్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి ):**
సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నాగారం సీఐ నాగేశ్వరరావు కోరారు. గురువారం జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి ఎస్ఐ పి.మధు, ఇన్‌ఛార్జి హెచ్ఎం జలగం పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి

**సూర్యాపేట(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో గల రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన డ్రై ఫ్రూట్ హౌస్ ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలు పొందుతూ వ్యాపార రంగంలో ముందుకు సాగాలని అన్నారు. వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని అన్నారు. సూర్యాపేటలో నూతనంగా డ్రై ఫ్రూట్ హౌస్ ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, దండు మైసమ్మ దేవాలయ చైర్మన్ తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, కౌన్సిలర్లు దిలీప్ రెడ్డి,నాగుల వాసు, నాయకులు, రవి, రమేష్, తిరుపతమ్మ, శివ, కవిత, రాజేష్, శివారెడ్డి, స్వాతి, తరుణి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్సీ ఓటు నమోదును వేగవంతం చేయాలి

### ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దామళ్ళ సత్యం పిలుపు

**ఖమ్మం, అక్టోబర్ 29, (జనంసాక్షి) :** ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దామళ్ళ సత్యం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గట్ల రాజన్న, ఉమ్మడి ఖమ్మం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ముక్కంటి సాయిచరణ్ పటేల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటర్ జాబితాలో నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా ఓటు నమోదు చేసుకునే విధానం పై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నాగార్జున, టౌన్ అధ్యక్షుడు కొప్పులరామారావు, యువజన విభాగం అధ్యక్షుడు తెలుపుట్ల జగపతి బాబు, యువజన విభాగం ప్రధాన కార్యదర్శితిరుమలగిరి జితేందర్, నాయకులు వినీత్ ఆధురీ అజాయ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు సాయిబాబా ఆలయంలో భక్తులకు అన్నదానం

**కల్లూరు అక్టోబర్ 29(జనంసాక్షి)** కల్లూరు పట్టణంలోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి , కృష్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు "పసుమర్తి చంద్రరావు" పాల్గొని, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత శ్రీ లం కోటేశ్వరి కృష్ణారెడ్డి దంపతులు, మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి, మేనేజర్ నంది శెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు భక్తులతో కలిసి సాయిబాబాను దర్శించుకున్నారు. అర్చకుల ఆశీర్వాదం తీసుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమానికి విరాళం అందించిన శ్రీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి దంపతులను ఆలయ నిర్వాహకమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు బీరవెల్లి మాధవ్, ఉబ్బన రాంబాబు, యాస నాగమణి శ్రీకాంత్, జె స్వాతి భాస్కర్ రెడ్డి, జి పుల్లారావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సాయి బాబా భక్తులు, ఆలయ నిర్వాహ కమిటీ సభ్యులు బొగ్గవరపు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు కాలువ నీళ్లు జిల్లాలోని ప్రతి ఎకరానికీ ఇవ్వాలి

### ❍ ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్.. ❍ సమస్య పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఉద్యమం..

**బూర్గంపహాడ్ అక్టోబర్ 29 (జనంసాక్షి)** సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతుల ప్రతి ఎకరానికీ సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన స్థానిక గిరిజన, సామాన్య రైతులకు సాగునీరు అందించకుండా పక్క జిల్లాకు తరలించడం అన్యాయమని ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో భాగంగా, బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బై రెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి మొరంపల్లి బంజరలోని సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువను అంజిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూర్గంపాడు, అశ్వాపురం, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డి పల్లి, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావు పేట తదితర మండలాల పరిధిలో సీతారామ ప్రాజెక్టు కాలువలు వెళ్తున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో ప్రాజెక్టు కోసం రైతులు తమ భూములను కోల్పోయినా, వారికి సాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన భద్రాద్రి జిల్లా రైతులకు న్యాయం జరగకపోవడం విచారకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జిల్లాలోని రైతులందరికీ సీతారామ ప్రాజెక్టు నీటిని అందించాలని కోరారు. సకాలంలో సాగునీరు అందించి ఉంటే ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఏర్పడుతున్న వ్యవసాయ ఇబ్బందులను కొంతవరకు తగ్గించే అవకాశం ఉండేదని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించకపోతే జిల్లా రైతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అంజిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. వెంకటరమణ, బూర్గంపాడు మండల బీజేపీ అధ్యక్షుడు బి. సాయిశ్రీను పాల్గొన్నారు.

## టేకులపల్లి లో కాటా రుసుం ఒక లక్షకు వేలంపాట కైవసం

**టేకులపల్లి, అక్టోబర్ 29(జనంసాక్షి):** టేకులపల్లి గ్రామపంచాయతీలో కొలగారం, కటారుసుము వేలం పాటను సర్పంచ్ బోడ బాలు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ వేలం పాటలో బోడ హిమసాయి రూ.లక్షకు కటారుసుమును కైవసం చేసుకున్నారు. వేలం ద్వారా వచ్చిన డబ్బు గ్రామపంచాయతీ అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభన్, ఉపసర్పంచ్ వసంత,వార్డు సభ్యులు మూడ్ గణేష్, ధరావత్ కొక్కు, జాటోత్ కిరణ్, బానోత్ రామకృష్ణ, భూక్య ఉష పాల్గొన్నారు. గ్రామపంచాయతీ ప్రతినిధులతో పాటు స్థానిక వేలంపాటదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## టేకులపల్లి,గుండాల,ఇల్లందు మండలాలను కరువు మండలంగా ప్రకటించాలి

### ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు తుపాకులు నాగేశ్వరరావు

**టేకులపల్లి, అక్టోబర్ 29(జనంసాక్షి):** టేకులపల్లి, గుండాల, ఇల్లందు మండలాలను కరువు మండలా లుగా ప్రకటించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్రనాయకులు తుపాకుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం టేకులపల్లి లో గుగులోతు రామచందు అధ్యక్షతన జరిగిన ముఖ్య సమావేశంలో నాగేశ్వరరావు,సిపిఐ యం ఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు లు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రం కరువుగా తాండవిస్తుందని నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశం అందుతున్నాయని భవిష్యత్తులో ధరలు విపరీతంగా పెరుగుతాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. టేకులపల్లి, గుండాల, ఇల్లందు మండలంలో వర్షపాతం తగినంతగా పడలేదని, మండల కేంద్రంలో పడిన వర్షపాత నమోదాన్ని పరిగణనలోకి తీసుకొని కరువు మండలాలుగా ప్రకటించకపోవడం దారుణమని అన్నారు. టేకులపల్లి,గుండాల, ఇల్లందు మండలం లో ప్రధానంగా వరి,మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా ఎలినినో ప్రభావంతో వరి,మొక్కజొన్న పంటలు లేవని అన్నారు. వేసిన పత్తి కూడా వర్షా ప్రభావంతో తగిన దిగుబడి రాక రైతు అప్పుల పాలవుతున్నారని అన్నారు. ప్రభుత్వం పునరా ఆలోచించి టేకులపల్లి,గుండాల,ఇల్లందు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలనిడిమాండ్ చేశారు. లేనియెడల అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్ర మంలో భూక్యా హర్ష, భూక్యా నర్సింగ్, కొడెం రవి, బానోతు వెంకట్రాం, అనంతోజు చంద్రాచారి,బిక్యా తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి బిడ్డకు ప్రోత్సాహం..

### వైద్య విద్యకు అండగా అక్కంపల్లి గ్రామ పంచాయతీ.!

### - ఎంబిబిఎస్ సీటు సాధించిన ఇందు కు ఘన సన్మానం.. రూ.10 వేల ఆర్థిక సాయం

**పి.ఏ.పల్లి,అక్టోబర్ 29 (జనంసాక్షి):** నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఆకారపు వెంకన్న కుమార్తె ఇందు ఎంబిబిఎస్ సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఆమె సాధించిన విజయాన్ని గుర్తించిన అక్కంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మద్దిమడుగు వినోద్ కుమార్ మరియు పాలకవర్గం సభ్యులు అభినందనలు తెలిపి,ఉన్నత చదువులకు ప్రోత్సాహంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వినోద్ కుమార్ ఇందు ఇంటికి వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. గ్రామ పంచాయతీ,పాలకవర్గం తరఫున ఇందు ని ఘనంగా సన్మానించి,ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పేద కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదివి వైద్య విద్యలో ప్రవేశం పొందడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఇందు సాధించిన విజయం గ్రామంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల ఉన్నత లక్ష్యాలకు అడ్డంకి కాకూడదని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఇందు భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు సేవలందించాలని ఆకాంక్షించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆమెను ప్రోత్సహించి,ఉన్నత చదువులకు తమ వంతు సహకారం అందించాలని అక్కంపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం కోరింది.

## రైతులకు అందుబాటులో మన గ్రోమోర్ ఉత్పత్తులు

### నాయకన్‌గూడెంలో నూతన దుకాణం ప్రారంభం

**కూసుమంచి, అక్టోబర్ 29 (జనంసాక్షి):** మండల పరిధిలోని నాయకన్‌గూడెం గ్రామంలో గురువారం నాడు 'మన గ్రోమోర్' నూతన కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ కంచర్ల సైదమ్మ కొండల్, ఏరియా మేనేజర్ సంతోష్ కలిసి ప్రారంభించారు. గ్రామస్తుడు బచ్చు కృష్ణమూర్తి దుకాణాల సముదాయంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఏరియా మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ.. అన్నదాతలకు సాగు, వాణిజ్య పంటలకు అవసరమైన అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు (పెస్టిసైడ్స్), రసాయన ఎరువులు (ఫెర్టిలైజర్స్) ఇక్కడ అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే పశుగ్రాసం (దాణా), ఆధునిక పవర్ స్ప్రేయర్లు కూడా రైతులకు ఎల్లవేళలా లభిస్తాయని చెప్పారు. పరిసర గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని ఆయన కోరారు. అనంతరం సర్పంచ్ సైదమ్మ మాట్లాడుతూ.. తమ గ్రామంలో గ్రోమోర్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించడం హర్షణీయమన్నారు. గోదావరి, కోరమాండల్ వంటి ప్రముఖ కంపెనీల ఎరువులు, మందులు ఇక్కడే దొరకడం వల్ల రైతులు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన శ్రమ, రవాణా ఖర్చులు తప్పుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మారోజు భీష్మాచారి, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ సురేష్, ఏరియా ఆడిటర్ ఈరమల్లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరవీరుల సభలు జరపండి

## మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ

**ఖమ్మం కార్పొరేషన్ , అక్టోబర్ 29 (జనంసాక్షి)**
ఒక మనిషిని మరొక మనిషి దోపిడి చేసే విధానం రద్దు కావాలని మనిషి ఉండటానికి ఇల్లు, తినడానికి ఆహారం విద్యా ,వైద్య సౌకర్యాలు కల్పించాలని గోదావరి పర్యాయక ప్రాంతంలో లక్షలాది ఎకరాలను పోడు కొట్టించి పేదలకు పంచిరాజ్యం చేత అమరులైన కాచనపల్లి అమరులు లడాయి గడ్డ అమరులు అనారోగ్యంతో ఆమరులైన సిపి ఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ బాటన్న దొరన్న డివి కే అనేకమంది అమరులు రక్తతర్పణ చేసి అమరత్వం పొందిన నవంబర్ మొదటి వారంలో అమరవీరుల సభలో నిర్వహించాలని సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 6న ఖమ్మం నగరంలోని ఒకటో డివిజన్ కైకోండయ్యగూడేంలో సిపి ఐ (ఎంఎల్ )మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల సభ నిర్వహిస్తున్నాము ఈ సభలో కార్మికులు ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ పిలుపునీవ్వడం జరిగింది. ఈరోజు పార్టీ టౌన్ ముఖ్య కార్యకర్తల సమావేశం కైకోండయ్యగూడేంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఝాన్సీ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్రామము నుండి ఢిల్లీ వరకు ఓటు చోరీ ఓట్ల దొంగతనం పాల్పడుతున్నది దీని అరికట్టాల్సిన బాధ్యత ప్రజలపై ఉన్నది ప్రజా పోరాటాల ద్వారా మాత్రమే ఓటుచూరిని ఆరికట్టగలుగుతం అదేవిధంగా దేశంలో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య అందుబాటులో లేని విధంగా ఉన్నవి ఎక్కడ చూసినా అవినీతి అక్రమాలు దోపిడీలు ఈ దేశంలో రాజ్యమేలుతున్నాయి వీటికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాలు బలోపేతం చేసినప్పుడు మాత్రమే పరిష్కారం అవుతాయని అలా చేసినప్పుడు మాత్రమేఅమరవీరులకు మనం అర్పించే నిజమైన నివాళులు అవుతాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకులు కే శ్రీనివాస్ నాయుడులు లేనిన్ కొమరయ్య అయితేన బోయిన వెంకన్న రాచబంటి రవి బొమ్మ కంటి రమేష్ రామనాథము తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ○8వ డివిజన్‌లో 7వ రోజు కొనసాగిన నమోదు ప్రక్రియ
- ○మాజీ మంత్రి పువ్వాడ సూచనలతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శిబిరం
- ○నవంబర్ 6 వరకు అందుబాటులో సేవలు: నాయకుడు భూక్యా అశోక్

**ఖమ్మం, (జనంసాక్షి)**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేస ుకోవాలని బీఆర్ఎస్ నాయకులు భూక్యా అశోక్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనల మేరకు ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ పరిధి వైఎస్సార్ కాలనీ బొడ్రాయి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం గురువారం నాటికి 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గోపాలపురం, బాలపేట, ఎల్.బి. నగర్ ప్రాంతాలకు చెందిన పాత ఓటర్ల జాబితాలోని 432 మందికి స్వయంగా ఫోన్ చేసి నమోదు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారి వివరాలను క్రోడకరించడంతో పాటు, ఇంకా నమోదు చేసుకోని వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు సేకరించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేశారు. అంతేకాకుండా అందుబాటులో ఉన్న ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు. ఆన్‌లైన్ దరఖాస్తు విధానంపై అవగాహన లేని వారికి అండగా నిలుస్తూ, తన వాట్సాప్ నంబర్‌కు పత్రాలు పంపించిన వారి తరఫున దరఖాస్తులు పూర్తి చేసి సంబంధిత రసీదు పత్రాలను వారికి అందజేస్తున్నట్లు అశోక్ తెలిపారు. గత వారం రోజులుగా అందిన దరఖాస్తులన్నింటినీ విజయవంతంగా ఆన్‌లైన్ చేసి ఓటర్లకు రసీదులు పంపినట్లు పేర్కొన్నారు. నమోదుకు చివరి రోజైన నవంబర్ 6వ తేదీ వరకు ఈ శిబిరం నిరంతరాయంగా కొనసాగుతుందని, గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన పలువురు యువకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదరికం నుంచి వైద్యరంగంలో చరిత్ర సృష్టించిన రూత్ జాన్ పాల్

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 29 (జనంసాక్షి)**
పేదరికం , సామాజిక వివక్షను అధిగమించి వైద్యరంగంలో అరుదైన ఘనత సాధించిన ఖమ్మం నగరం రమణగుట్టకు చెందిన డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్ జీవన ప్రస్థానం అందరికీ స్ఫూర్తి దాయకమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఐపీఎస్ కొనియాడారు . 58వ డివిజన్‌కు చెందిన రూత్ జాన్ పాల్ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి , ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పట్టుదలతో చదువుకుని ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ పూర్తి చేయడం అభినందనీయమన్నారు . దేశంలోనే ఈ ఘనత సాధించిన తొలి ట్రాన్స్ మహిళగా ఆమె నిలిచారని పేర్కొన్నారు . ఒకప్పుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ వివక్షను ఎదుర్కొన్న ఆమె , న్యాయపోరాటం చేస్తూ తన లక్ష్యాన్ని చేరుకోవడం అసాధారణ విజయమన్నారు . ప్రస్తుతం సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి అత్యవసర విభాగంలో వైద్యురాలిగా సేవలందిస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారని తెలిపారు . అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఆత్మవిశ్వాసం , పట్టుదలతో ముందుకు సాగితే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని రూత్ జాన్ పాల్ నిరూపించారని సజ్జనార్ ప్రశంసించారు . ఆమె భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని , మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు .

# నవంబర్ 5 నుంచి పీడీఎస్‌యూ విద్యార్థి అమరవీరుల వారోత్సవాలు

## జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా యాక్టింగ్ కార్యదర్శి తిమ్మిడి రఘు పిలుపు

**ఖమ్మం, (జనంసాక్షి) :**
పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 05 నుంచి 11వ తేదీ వరకు విద్యార్థి అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా యాక్టింగ్ కార్యదర్శి తిమ్మిడి రఘు పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం నగరంలోని మాస్ లైన్ కార్యాలయంలో పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిమ్మిడి రఘు మాట్లాడుతూ.. నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఆవిర్భవించిన పీడీఎస్‌యూ సుదీర్ఘ పోరాట ప్రస్థానంలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, రంగవల్లి, చేరాలు, రమణయ్య, సాంబయ్య వంటి ఎందరో విద్యార్థి రత్నాలు ఉద్యమాల్లో అమరులయ్యారని కొనియాడారు. వారి ఆశయాల స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా సాధనే లక్ష్యంగా విద్యార్థి లోకం ఉద్యమించాలని కోరారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యలు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఇంజనీరింగ్ మరియు యూనివర్సిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు తిప్పారపు లక్ష్మణ్, జిల్లా నాయకులు స్టాలిన్, కార్తీక్ రెడ్డి, గణేష్, సుమన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల వర్ధంతి సభలను జయప్రదం చేయండి

## నవంబర్ 1 నుంచి 7 వరకు గ్రామగ్రామాన సభలు

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 29(జనంసాక్షి):**
భూమి, భుక్తి, దేశ విముక్తి కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు గ్రామగ్రామాన వర్ధంతి సభలు నిర్వహించనున్నట్లు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య, జిల్లా కార్యదర్శి సీవై పుల్లయ్య తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.గురువారం రూరల్ మండలం లోని ఎం .వెంకటాయపాలెంలోని గంగవరపు శ్రీనివాసరావు స్మారక భవనంలో మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పాలేరు డివిజన్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ 4న ఎం.వెంకటాయపాలెం, కాచిరాజుగూడెంలో, 5న తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించి, జెండాలు ఎగురవేసి ప్రదర్శనలు నిర్వహించాలని కోరారు.
డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య మాట్లాడుతూ నిత్యావసర ధరలు తగ్గించి రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల సరుకులు అందించాలని, ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హులకు న్యాయం చేయాలని, తొలగించిన ఓట్లను ఓటర్ల జాబితాలో పునరుద్ధరించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలి రూ.750 చెల్లించి, ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో డివిజన్ నాయకులు రేపాకుల శివలింగం, కమ్మకోమటి నాగేశ్వరరావు, ఎడ్లపల్లి ఉపేందర్, చిర్రా భిక్షం, కుర్రా వెంకన్న, వీర్ల వెంకట అప్పారావు, రెంటాల యాదగిరి, పులుగుజ్జు వెంకటస్వామి, అవిరేని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టీఎస్ యుటిఎఫ్ 7వ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

## - నవంబర్ 1,2 తేదీల్లో కట్టంగూరులో జిల్లా మహాసభలు.. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలి

**పి.ఏ.పల్లి,అక్టోబర్ 29(జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ( టీఎస్ యుటిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను గుడిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. గుడిపల్లి మండల విద్యాధికారి సముద్రాల శ్రీనయ్య,టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పగిళ్ల సైదులు పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు భాషిపాక జైపాల్,ప్రధాన కార్యదర్శి నోముల నాగేందర్ మాట్లాడుతూ నవంబర్ 1,2 తేదీల్లో కట్టంగూరులోని బీఎన్ గౌడ్ ఫంక్షన్ హాల్‌లో 7 వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారురెండో రోజు జిల్లా ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.కావున జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యక్షులు చాట్ల వెంకటయ్య,పి.హరిలక్ష్మి,కోశాధికారి కె. సూర్యకళ,ఉపాధ్యాయులు టి.శ్రీవిద్య,వి. కృపమ్మ, పి.పూజ, సీఆర్పీలు బి.కరుణ,ఈదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాంతం కోసం జీవితాన్ని ధారపోసిన నిస్వార్థ నాయకుడు 'వాసవి'

**❍కుటుంబ బంధాల కంటే పార్టీ నిష్ఠకే ప్రాధాన్యమిచ్చిన నేత**

**❍తిరుమలాయపాలెం మండలంలో సహకార రంగానికి నూతన జవజీవాలు**

**తిరుమలాయపాలెం (జనంసాక్షి):** రాజకీయాల్లో స్వార్థం, పదవీ లాలస రాజ్యమేలుతున్న ప్రస్తుత రోజుల్లో? నమ్మిన సిద్ధాంతం కోసం, కష్టాల్లో ఉన్న పార్టీ నిర్మాణం కోసం జీవితాంతం అంకితభావంతో పనిచేసిన ఆదర్శ ప్రజా సేవకుడు, ఉద్యమశీలి వాసవి అని నాయకులు, కార్యకర్తలు కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఉద్యమ శ్రేణులు ఘనంగా నివాళులర్పించి, ఆయన త్యాగానికి 'రెడ్ సెల్యూట్' సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ఉద్యమ సహచరులు మాట్లాడుతూ? వాసవి గారి రాజకీయ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆనాడు రాజకీయాలను ఒక్క క్షణం పక్కనపెట్టి, తన మామగారితో చేతులు కలిపి ఉంటే ఆయన వ్యక్తిగత జీవితం, ఆర్థిక స్థితిగతులు వేరే స్థాయిలో ఉండేవని గుర్తుచేశారు. కానీ వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా హితమే మిన్న అని నమ్మిన ఆయన? కుటుంబంలో ఎన్ని ఒడిదుడుకులు, ఒత్తిళ్లు ఎదురైనా తాను విశ్వసించిన సిద్ధాంతం వీడ లేదన్నారు. తాను నమ్మిన నాయకులు రాయల సుభాష్ చంద్రబోస్, నాగేశ్వర రావుల అడుగుజాడల్లో నడుస్తూ, గ్రామంలో పార్టీ నిర్మాణానికి పటిష్ట పునాదులు వేశారని శ్లాఘించారు. కరువు పీడిత ప్రాంతమైన తిరుమలాయపాలెం మండలంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సహకార సంఘంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించి, పాలకవర్గ బాధ్యతల్లో తన ముద్ర వేస్తూ మండలంలోని సంఘాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించారని గుర్తుచేసుకున్నారు. ఆఖరి శ్వాస వరకు పార్టీ అభ్యున్నతికే పరితపించిన వాసవి గారి నిబద్ధత ఎప్పటికీ చిరస్మరణీయమని, ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని ఉద్యమ శ్రేణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




# అసలైన హంతకులను కాపాడేందుకు పోలీసుల క్రైమ్ స్టోరీ

**సిపిఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**

**ఖమ్మం, అక్టోబర్ 29, (జనంసాక్షి):** సీపీఎం నేత సామినేని రామారావు హత్య కేసులో పోలీసులు తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే సంబంధం లేని నలుగురిని పట్టుకొచ్చి, అసలైన హంతకులను వదిలేస్తున్నారని సిపిఐ ( ఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటన లో తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన సాక్షులు, రామారావు భార్య స్వయంగా కొన్ని పేర్లు చెప్పినప్పటికీ వారిని విచారించకుండా వదిలేశారని ఆయన పేర్కొన్నారు. అసలైన హంతకులను రక్షించేందుకే ఈ విధమైన అభూత కల్పనలతో కూడిన క్రైమ్ స్టోరీని రచించి సీపీ తన భుజాన వేసుకున్నారని విమర్శించారు. పోలీసుల తీరుపై ఖమ్మం సీపీ పై తమకు ఎలాంటి నమ్మకం లేదని, అందుకే సిట్ చేత దర్యాప్తు జరిపించి న్యాయం చేయాలని సీపీఎం తరఫున ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. సిట్ దర్యాప్తు జరిపిస్తానని చెప్పిన సీఎం ఆ తర్వాత మాట తప్పారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిట్ చేత ఈ హత్య కేసుపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఘటనను చూసిన సాక్షులు, రామారావు భార్య చెప్పిన వ్యక్తులను విచారించి అసలైన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం నామమాత్రంగా ఎవరినో ఇరికించి, అసలైన వాళ్లను దాటించే ప్రయత్నం చేస్తున్నారని మొదటి నుంచీ తాము చెప్తున్నామని స్పష్టం చేశారు. ఎవర్నో కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

## పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి: తక్కెళ్లపల్లి రవీందర్ రావు

**ఖమ్మం, (జనంసాక్షి) :** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పిలుపునిచ్చారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉద్యోగులు, పట్టభద్రులను ఆయన కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఓటర్ల నమోదుకు నవంబర్ 6వ తేదీ ఆఖరు గడువు అని, చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో నియోజకవర్గంలో సుమారు 28,500 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ప్రభుత్వ లెక్కల ప్రకారం దాదాపు 20 వేల మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. గతంలో ఉన్న వారితో పాటు కొత్తగా డిగ్రీ పూర్తి చేసుకున్న వారిని కలుపుకుంటే ఖమ్మం నియోజకవర్గంలో ఓట్ల సంఖ్య 50 వేలు దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన గొప్ప బాధ్యతని, ప్రతి పట్టభద్రుడు నమోదు చేసుకోవడంతో పాటు తమ మిత్రులు, కుటుంబ సభ్యులను కూడా చైతన్యపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ లైబ్రరీ చైర్మన్ ఖమర్, కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ కర్ణాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీప్రసాద్, మాజీ కార్పొరేటర్ ఊట్కూరి రవికాంత్, నాయకులు గౌరినాథ్, వీరేశ్ గౌడ్, తాళ్లూరి సంతోష్, కోడి వీరబాబు, వెంకట్, గుంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మేళ్ళ చెరువు పీహెచ్‌సీకి కొత్త ఇన్‌ఛార్జిగా డాక్టర్ టి . నిఖిల్ నిరుపమ్

**సుధాకర్ నాయక్ స్థానంలో బాధ్యతలు**

**మేళ్లచెరువు జనం సాక్షి** విధులకు అనధికారికంగా గైర్హాజరవుతున్నారనే కారణంతో. మేళ్ళ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ స్థానంలో డాక్టర్ టి. నిఖిల్ నిరుపమ్‌కు బాధ్యతలు అప్పగించారు. కోదాడ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఈ మేరకు అక్టోబర్ 28న ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిఖిల్ నిరుపమ్ ఇన్‌ఛార్జిగా కొనసాగనున్నారు. విధులకు తిరిగి హాజరైన వెంటనే డాక్టర్ సుధాకర్ నాయక్ డీఎంహెచ్‌వోను కలిసి తదుపరి సూచనలు పొందాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## కమ్యూనిటీ సిసిటివి వ్యవస్థ ఏర్పాటుకు సర్పంచులు చొరవ తీసుకోవాలి - సి ఐ సరవయ్య

**నేరాల నివారణకు, ప్రజల భద్రతకు, పోలీసులకు సహకారం అందించాలి**

**పెనుబల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి)** ప్రతి గ్రామంలో కమ్యూనిటీ సీసీటీవీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సర్పంచులు చొరవ తీసుకోవాలని, నేరాల నివారణకు, ప్రజల భద్రతకు, పోలీసులకు పూర్తి సహకారం అందించాలని సత్తుపల్లి రూరల్ సిఐ సరవయ్య కోరారు. గురువారంఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం వి.ఎం. బంజర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ ఐ షాకీర్ మండలనీలోని గ్రామ పంచాయతీ సర్పంచుల తో కమ్యూనిటీ సీసీటీవీ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ హాజరై, ప్రస్తుత పరిస్థితులు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత గురించి సర్పంచులకు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లు, గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాల నియంత్రణ చేయవచ్చున్నారు , అలాగే నేరస్థులను గుర్తించడం, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని వివరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడటంలో ప్రజల భాగస్వామ్యం, పోలీసులతో సమన్వయం ఎంతో ముఖ్యమని తెలిపారు. సమావేశంలో ఏ ఎస్ ఐ పొట్లపూల శ్రీను, గ్రామపంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.

## సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు

**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి - ఎంఈఓ శ్రీనివాస్**

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 29జనంసాక్షి** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో గల సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబరిచి ప్రతిభను చాటుకోవాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు. క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం, ఐకమత్యం, గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం అలవడుతుందని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణతో విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభిస్తుందని, క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రశాంతి, పీఈటీలు రామారావు, కృష్ణ, భాస్కర్, విజి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటు ముప్పును తగ్గించుకోవాలి

**పెన్షనర్లకు అవగాహన కల్పించిన డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్**

**భద్రాచలం అక్టోబర్ 29 (జనంసాక్షి)** గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించుకోవాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. భద్రాచలంలోని పెన్షనర్ల కార్యాలయంలో గురువారం గుండెపోటు కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా గుండెపోటు ముప్పును తగ్గించుకోవచ్చని వివరించారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సైదులు, శ్రీధర్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు భూషణం, కార్యదర్శి హనుమంతరావు, డీపీఎంవో పాయం శ్రీనివాసరావు, పర్యవేక్షకుడు కృష్ణయ్యతో పాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

# జలసిరి పనులను వేగవంతం చేయాలి

**జాజిరెడ్డిగూడెం (జనం సాక్షి ):** ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని, వీబీజీ రామ్‌జీలో జరుగుతున్న జలసిరి పనులను వెంటనే వేగవంతం చేయాలని ఎంపీడీఓ పల్లపు రూన్సీ అధికారులను ఆదేశించారు. గురువారం లోయపల్లి, నాణ్యతండా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీబీజీ రామ్‌జీ పనులు, మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులను, ఉపాధి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గంట యల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు నారాయణమూర్తి, మాధవరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అరె సైదులు, మేట్లు, రైతులు పాల్గొన్నారు.